క్లుప్తంగా

పారిశుధ్య పనుల్లో భాగస్వాములు కావాలి



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

సీతానగరం: పారిశుధ్య పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డీఎంహెచ్‌ఓ ఎస్. భాస్కరరావు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో డాక్టర్ పి.పావని ఆధ్వర్యంలో సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్య రహిత సమాజమే మనందరి లక్ష్యం కావాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చురుగ్గా చేపట్టాలని సూచించారు. అలాగే మండల ప్రత్యేక అధికారి కరుణాకర్, ఎంపీడీఓ పి. త్రివిక్రమరావు ఆధ్వర్యంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గోకులాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎంపీడీఓ జీవీ రమణమూర్తి



లచ్చిరాజుపేటలో నిర్మాణంలో ఉన్న గోశాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జీవీ రమణమూర్తి

పార్వతీపురం రూరల్: ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పాడి రైతులకు ప్రభుత్వం నిర్మిస్తున్న గోశాలలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి అన్నారు. మండలంలోని లచ్చిరాజుపేటలో నిర్మాణంలో ఉన్న గోశాలలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గోశాలలు పాడి రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. అనంతరం తాళ్లబురిడిలో జరుగుతున్న పీ-4 సర్వేను పరిశీలించారు.

తుమరాడలో దాహం కేకలు



బిందెలు పట్టుకుని నిరసన తెలియజేస్తున్న మహిళలు

బలిజిపేట: మండలంలోని తుమరాడలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. రెండు నెలల నుంచి తాగునీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో సీపీఎం నాయకుడు మన్మధరావు ఆధ్వర్యంలో మహిళలు శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తాగునీరు సరఫరా చేయాలని, లేనిపక్షంలో ఆందోళన ఉద్యతం చేస్తామని స్పష్టం చేశారు. దీనిపై కార్యదర్శి స్పందిస్తూ రెండు రోజుల్లో తాగునీటి సరఫరా పునరుద్ధరిస్తామన్నారు.

అవగాహన..

బలిజిపేట: పాలిథిన్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మండల ప్రత్యేకాధికారి రాబర్ట్‌పాల్ తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించి, మహిళలకు పరిసరాల పరిశుభ్రతపై వివరించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా విడదీసి క్లాప్‌మిత్రలకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, మహిళలు పాల్గొన్నారు.

బలిజిపేటలో మూడు పరీక్ష కేంద్రాలు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ-2 సామల

బలిజిపేట: పదో తరగతి పరీక్షలకు సంబంధించి మండలంలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఆయా కేంద్రాల్లో 472 మంది పరీక్షలు రాయనున్నారని ఎంఈఓ-2 సామల సింహాచలం అన్నారు. ఈ మేరకు పరీక్ష కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బలిజిపేట ఉన్నత పాఠశాలలో రెండు కేంద్రాలు, వంతరాంలో ఒక పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ విధించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వంతెన నిర్మాణంపై ఆరా

బలిజిపేట: మండలంలోని పి.చాకరాపల్లి గ్రామం నుంచి గౌరీపురం రోడ్డు నిర్మాణంలో భాగంగా దేసూరు గెడ్డమీద వంతెన నిర్మాణంపై సర్పంచ్ మోహనరావు, గ్రామస్తులు శనివారం ఆరా తీశారు. సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.. ఎంత ఎత్తులో నిర్మిస్తారు.. వెడల్పు, తదితర అంశాలపై చర్చించారు. రాకపోకలకు ఇబ్బంది కలగకుండా పనులు చేపట్టాలని సర్పంచ్ కోరారు.

ఊరు బడికి రక్షణ కరువు..

- మోడల్ స్కూళ్ల ఏర్పాటు పేరుతో తొలగింపునకు చర్యలు
- ప్రాథమిక, యూపీ పాఠశాలల తరగతులు తగ్గించి రద్దుకు ప్రయత్నాలు
- జిల్లాలో 1321 ప్రైమరీ, 672 అప్పర్ ప్రైమరీ పాఠశాలలు
- గ్రామాల్లో విద్యకు దూరం కానున్న విద్యార్థులు
- ఊరుబడిని రక్షించుకోవడానికి యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసనలు



ఊరిబడిని రక్షించుకుందాం అంటూ సమావేశమైన ఉపాధ్యాయ సంఘాల సభ్యులు (ఫైల్)

పార్వతీపురం టౌన్:

నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తూ అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. పాఠశాలల డిజిటలైజేషన్ పేరుతో ప్రతీ ఉన్నత పాఠశాలలో ఐఎఫ్‌పీ ప్యానళ్లు, విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసి విద్యా వ్యవస్థలో డిజిటల్ విప్లవాన్ని తీసుకువచ్చారు. అయితే నేటి కూటమి ప్రభుత్వం మాత్రం విద్యావ్యవస్థపై చిన్నచూపు చూస్తోంది. పాఠశాలల అభివృద్ధికి సంబంధించిన నాడు - నేడు పనులు ఎక్కడ పనులు అక్కడే నిలిపివేశారు. విద్యార్థులకు అందించాల్సిన ట్యాబ్‌లను మరిచారు. తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల ఊసెత్తడం లేదు. సీబీఎస్‌ఈ, టోఫెల్ వంటి సంస్కరణలను సైతం మూలన పడేశారు. తాజాగా మోడల్ స్కూళ్ల ఏర్పాటు పేరుతో గ్రామాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలలు, యూపీ పాఠశాలల్లో తరగతులను తగ్గించి భవిష్యత్‌లో ఈ పాఠశాలలను రద్దు చేయడానికి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ విధానం వల్ల గ్రామాల్లోని విద్యార్థులు విద్య దూరమయ్యే ప్రమాదముందని విద్యారంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 1321 ప్రాథమిక పాఠశాలలు, 672 ప్రాథమికోన్నత పాఠశాలలు రద్దు కానున్నాయన్న భయం విద్యార్థుల తల్లిదండ్రుల్లో నెలకొంది.

గ్రామాల్లో పాఠశాలలు లేనట్టేనా..?

కూటమి ప్రభుత్వం మోడల్ స్కూళ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఒక్కో పంచాయతీ లేదా మేజర్ పంచాయతీల్లో మోడల్ స్కూల్ ఏర్పాటు చేసి చుట్టు పక్కల గ్రామాల్లో ఉండే 4,5,6,7 తరగతుల విద్యార్థులను మోడల్ స్కూల్‌కు మ్యాపింగ్ చేయనున్నారు. ఫలితంగా గ్రామాల్లో ఉండే ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో తరగతుల సంఖ్య తగ్గుతుంది. కొద్ది రోజులకు ఆయా గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారనుంది.

పాఠశాలలు కొనసాగించాలి



మోడల్ స్కూల్ పేరుతో పక్కనున్న ప్రాథమిక పాఠశాలల తరగతులను రద్దు చేయకూడదు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలి. ఇంగ్లిష్, తెలుగు మీడియంలలో విద్యాబోధన చేపట్టాలి. పాఠశాలలు మూసివేస్తే గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉంది.

– ఎస్. మురళీమోహన్‌రావు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

ఈనెల 25న కలెక్టరేట్ వద్ద ధర్నా..

ఊరి బడులను యథావిధిగా కొనసాగించాలని విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి ఉపాధ్యాయ సంఘాలు ఈనెల 25న పార్వతీపురం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నాయి. మోడల్ స్కూళ్లు ఏర్పాటు చేయండి కాని, ప్రస్తుతం ఉన్న పాఠశాలల తరగతులు మాత్రం రద్దు చేయవద్దన్న డిమాండ్‌తో ధర్నా చేపట్టనున్నారు. ప్రభుత్వం ఈ అంశంపై పునరాలోచన చేయాలని, లేనిపక్షంలో ఉద్యమం చేపట్టక తప్పదని స్పష్టం చేస్తున్నారు.

మర్యాద పూర్వక కలయిక..



రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల పర్యవేక్షణ, వాటి అమలుపై పర్యవేక్షించడానికి జిల్లాకు వచ్చిన పార్వతీపురం మన్యం జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ నారాయణ భరత్‌గుప్తను ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

– పార్వతీపురం రూరల్

జీడి పిక్కలు కొనుగోలు చేయాలి..



చిన్న, సన్నకారు రైతులు మెట్ట ప్రాంతాల్లో పండిస్తున్న జీడి పిక్కలను ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు చేయాలని రైతు సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు రైతు సంఘం జిల్లా నాయకుడు డి. అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు పలువురు రైతులతో కలిసి శనివాం స్థానిక తహసీల్దార్ ప్రసన్న కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 80 కిలోల బస్తా రూ 16 వేలకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో దళారుల చేతిలో రైతులు మోసపోతున్నారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా, మండల నాయకులు చందనపల్లి కృష్ణ, జి. వెంకటరమణ పాల్గొన్నారు.

– సీతానగరం

అవగాహన పెంపొందించుకోవాలి..



స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని సబ్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. పట్టణంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ ర్యాలీలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. అలాగే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను వినియోగించరాదని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రసాద్, ఎంపీడీఓ పార్వతి, నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

– సాలూరు

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం..



ఆలయంలో శాంతిపూజ చేస్తున్న అర్చకులు

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేటలో మూడు రోజులుగా జరుగుతున్న భీమలింగేశ్వర స్వామి ఆలయ ప్రారంభోత్సవాలు శనివారంతో ముగిశాయి. గ్రామస్తులు లక్షలాది రూపాయలు పోగుచేసి ఆలయాన్ని నిర్మించారు. ఆలయ అర్చకుల పర్యవేక్షణలో ఆగమ పండితుల ఆధ్వర్యంలో గురువారం ప్రారంభమమైన పూజలు శనివారం వరకు కొనసాగాయి. చివరి రోజు మధ్యాహ్నం వేలది మందికి అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి. శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు ఎం. బాబ్జీ, ఎంపీటీసీ సభ్యుడు సింహాచలం, సర్పంచ్ చింతాడ కృష్ణ, మాజీ సర్పంచ్ వి. గుంపస్వామి, ఉప సర్పంచ్ వి. సన్యాసినాయుడు, చిన్నారావు (దొర), శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన తప్పనిసరి

- నేత్ర వైద్యాధికారి నగేష్‌రెడ్డి



ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నగేష్ రెడ్డి

పార్వతీపురం టౌన్: నేత్ర సంబంధిత వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి అన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా ఆస్పత్రిలో నిర్వహిస్తున్న ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి కాసుల వ్యాధిపై జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు, ర్యాలీలు, స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామన్నారు. ప్రజలకు ఈ వ్యాధిపై తగు సలహాలు, సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. ఎటువంటి నేత్ర సమస్యలున్నా వెంటనే సమీప ఆస్పత్రుల్లో నేత్ర వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో నేత్ర వైద్యులు శ్యామల, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

జీతాల సమస్య పరిష్కరిస్తాం..

సాక్షి ఎఫెక్ట్...

సాలూరు: మున్సిపల్ పారిశుధ్య కార్మికుల జీతాల సమస్య పరిష్కరిస్తామని ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ హామీ ఇచ్చారు. కార్మికులకు జీతాలు సక్రమంగా చెల్లించకపోవడంతో ఐదు రోజులుగా వారు సమ్మె చేస్తున్నారు. దీంతో పట్టణంలో పారిశుధ్యం క్షీణించడంతో ఇటీవల సాక్షిలో 'కంపుగొడుతున్న సాలూరు' శీర్షికన వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, టీపీఐ ఝాన్సీ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాజీవ్, తదితరులు కార్మిక సంఘ నాయకులతో చర్చించారు. సమస్యల పరిష్కారానికి ఈ సందర్భంగా హామీ ఇవ్వడంతో, కార్మికులు సమ్మె విరమించారు. కార్యక్రమంలో నాయకులు ఎన్‌వై నాయుడు, రాముడు, శంకరరావు, రామకృష్ణ, రవి, సీత, దేవి, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయండి

పార్వతీపురం: రోజురోజుకీ ఎండ తీవ్రత ఎక్కువవుతున్న దృష్ట్యా జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు జి. వెంకటరమణ కోరారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణానికి వివిధ పనుల నిమిత్తం వచ్చేవారు తాగునీటికి ఇబ్బంది పడకుండా చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు పి. సన్యాసిరావు, బి. లక్ష్మి, రెడ్డి శ్రీదేవి, సూర్యనారాయణ, ఉమామహేశ్వరరావు, రాజశేఖర్, వెంకటరమణ ఉన్నారు.

18న వేలంపాట

సాలూరు: వివిధ ఎక్సైజ్ కేసులలో పట్టుబడిన వాహనాలను ఈ నెల 18న వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ దాసు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో జరగనున్న వేలంపాటలో ఆసక్తిగల వారు పాల్గొనాలని కోరారు.

ప్రారంభానికి ముందే పగుళ్లు..



ఆపరేషన్ థియేటర్ వద్ద శ్లాబ్‌కు ఏర్పడిన బీటలు

సాలూరు: సాలూరు నియోజకవర్గంతో పాటు ఒడిశా ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన వంద పడకల ఆస్పత్రి భవనాలు ప్రారంభానికి ముందే పగుళ్లతో దర్శనమిస్తోంది. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర కృషితో సాలూరుకు వంద పడకల ఆస్పత్రి మంజూరైంది. అప్పట్లోనే 75 శాతం పనులు జరగ్గా.. కూటమి ప్రభుత్వ హయాంలో మిగిలిన పనులు జరుగుతున్నాయి. అయితే తాజాగా చేపడుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆపరేషన్ థియేటర్ వద్ద శ్లాబ్ బీటలు ఇచ్చింది. దీనిపై ఏపీఎంఎస్ఐడీసీ డీఈ శ్రీనివాసమూర్తి వివరణ కోరగా.. శ్లాబ్ మరమ్మతులకు ప్రత్యేకంగా 25 లక్షల రుపాయలకు టెండర్లు ఆహ్వానించామని, త్వరలోనే పనులు చేపడతామని చెప్పారు.

రెల్లి కులస్తులకు న్యాయం చేయాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న రెల్లి, ఉపకులాల సేవా సంఘు సభ్యులు

పార్వతీపురం టౌన్: రెల్లి కులస్తులకు ప్రభుత్వం న్యాయం చేయాలని ఆ సంఘ నాయకులు జి. డేనియల్, పి. రాజశేఖర్, ఎస్. గౌరీశంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఇందిరాకాలనీ కూడలి వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద రెల్లి కులస్తులతో శనివారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 20 లక్షల మంది రెల్లి, ఉపకులాలు వారు ఉన్నారని.. వారికి విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో ఒకశాతం రిజర్వేషన్ ప్రకటించడం బాధాకరమన్నారు. ప్రభుత్వం స్పందించి 5 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీ ప్రకారం రెల్లి, ఉపకులాలకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కె. నానాజీ, కె. సుధాకర్, ఎస్. శ్రీకాంత్, జి. శరత్ చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభించాలి



జిల్లేడువలస జీడి రైతులతో మాట్లాడుతున్న ఆదివాసీ సంఘు నాయకులు

సాలూరు రూరల్: గిరిజనులు పండిస్తున్న జీడి పంటకు ప్రభుత్వ కనీసం మద్దతు ధర ప్రకటించడంతో పాటు జీడి ప్రాసెసింగ్ యూనిట్లు వెంటనే ప్రారంభించాలని ఆదివాసీ గిరిజన సంఘ నాయకుడు గెమ్మెల జానకీరావు డిమాండ్ చేశారు. మండలంలోని జిల్లేడువలసలో ఆదివాసీ సంఘ నాయకులు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా జీడి రైతులతో మాట్లాడుతూ..ఈ నెల 17,18 తేదీల్లో చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

మండలంలోని 5500 ఎకరాల్లో జీడిపట సాగవుతోందని, ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించాలని సీపీఎం నాయకుడు మర్రి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు ఎన్‌వై నాయుడు, గిరిజన రైతులు కూనేటి సుబ్బయ్య, గెమ్మల మంగమ్మ పాల్గొన్నారు.

జిల్లా ప్రత్యేక అధికారికి స్వాగతం..

పార్వతీపురం టౌన్: పార్వతీపురం జిల్లా ప్రత్యేక అధికారిగా డాక్టర్ భరత్ నారాయణ గుప్తాను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆయన జిల్లా పర్యటన నిమిత్తం శనివారం పార్వతీపురం పట్టణానికి చేరుకోగా కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



మక్కువ : తహసీల్దార్ కార్యాలయంలో మొక్కలు నాటుతున్న, తహసీల్దార్ షేక్ ఇబ్రహీం, తదితరులు



పాచిపెంట: ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, తదితరులు

పాచిపెంట:

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతని ఎంపీపీ ప్రమీల అన్నారు. మండలంలో పద్మాపురం పంచాయతీలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల రోగాలకు దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పాత్రో, ఈఓపీఆర్‌డీ మల్లేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు పాచిపెంట వీరంనాయుడు, సర్పంచ్ వీరయ్య, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

సన్యాసిరాజపురంలో ర్యాలీ

మక్కువ: మండలంలోని సన్యాసిరాజపురంలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర ర్యాలీని ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రెవెన్యూ కార్యాలయం ఆవరణలో పరిసరాలను పరిశుభ్రం చేసి మొక్కలు నాటారు. అనంతరం మొక్కలు నాటారు. అలాగే శంబర పోలమాంబ ఆలయ ఆవరణలో చెత్తాచెదారాలను ఏరివేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ ఇబ్రహీం, పోలమాంబ ఆలయ ఈఓ వీవీ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.